క్లుప్తంగా

ఏఎన్‌యూలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. యూనివర్సిటీలోని ఆరు కళాశాలల విద్యార్థులకు వేర్వేరుగా ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారు. పురుషులకు క్రికెట్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కో–కో, వాలీబాల్, మహిళలకు క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నికాయిడ్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవంలో రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.జాన్సన్ పాల్గొన్నారు. మొదటి రోజు పోటీలలో భాగంగా వీసీ రాజశేఖర్ పురుషుల వాలీబాల్, రిజిస్ట్రార్ కరుణ త్రోబాల్ ఆడి పోటీలు ప్రారంభించారు.

ఈ- ఆటో రిక్షా ప్రారంభం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతనంగా కొలుగోలు చేసిన ఈ-ఆటో రిక్షా ను బుధవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. పూర్తిగా బ్యాటరీతో నడిచే ఈ వాహనం ద్వారా గార్బేజ్ క్లీనింగ్ చేయనున్నారు. సుమారు రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన ఈ వాహనం ద్వారా వేగవంతంగా పనులు చేసే అవకాశం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఓఎస్‌డీ కె.సునీత, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దాలి



గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్‌ఈ విద్యా విధానంలో విద్యార్థులను అన్ని రంగాల్లో సమగ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వేణుగోపాల్‌రెడ్డిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ కలసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య పేరుతో నెలకొల్పిన పాఠశాల ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. కలసిన వారిలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ- డీఎల్‌టీసీల సిబ్బంది అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను ప్రాంతీయ ఉప సంచాలకుడు ఎస్‌వీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ, జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్‌టీసీ)లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమర్తలూరి యోబు, కార్యదర్శి బండి రమేష్‌బాబు, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ సభ్యులు, వివిధ ఐటీఐల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన బుధవారం చోటుచేసుకుంది. చేబ్రోలు గొడపాలెం ప్రాంతానికి చెందిన నూతలపాటి నవీన్ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో నవీన్‌కు కాలు విరిగింది. తీవ్ర గాయాలైన నవీన్‌ను 108లో వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల రాయుళ్ల అరెస్ట్

గుంటూరు రూరల్: కోడిపందేల రాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రత్నగిరి నగర్ శివారుల్లో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు దాడిచేయగా కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులు వారి వద్ద నుంచి రూ.6 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



భీమ్ సేన సేవాదళ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. బుధవారం పూలే జయంతిని పురస్కరించుకుని హిందూ కాలేజీ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా విద్యార్థిని, ఉపాధ్యాయిని అయిన సావిత్రీబాయి పూలే మొట్టమొదటి మహిళా విద్యాలయాన్ని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గంటా ప్రభుదాస్, డి.సుధాకర్, జాన్‌బాబు, జూపూడి శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, తాడికొండ నరసింహారావు, కె.జయసుధ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా విద్యకు శ్రీకారం చుట్టిన సావిత్రీబాయి పూలే స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని యునెస్కో క్లబ్స్ ఇంటర్నేషనల్ దక్షిణ భారత ప్రాంతీయ సమన్వయకర్త రామనాథం పరమేశ్వరరావు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం యునెస్కో క్లబ్స్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా జరిపారు. ఈసందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ 19వ శతాబ్దంలో సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా మహారాష్ట్రలో తన భర్త జ్యోతిరావ్ పూలే సహకారంతో చదువుకుని బాలికలకు, మహిళలకు, వితంతువుల కోసం పాఠశాలలను ఏర్పాటు చేసి ఆధునిక భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా కీర్తి గడించిన స్ఫూర్తి దాయకురాలని అన్నారు. డాక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సావిత్రీబాయి పూలే భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులని కొనియాడారు.

ఈ సందర్భంగా విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి నర్సింగ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కొతారపు రాజేశ్వరి, హైకోర్టు న్యాయవాది వై.లక్ష్మీ శైలజ, క్యూరియస్ మైండ్స్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ షరీఫ్, యునెస్కో మిలియన్ మిలీనియం మహిళా క్లబ్ అధ్యక్షురాలు ముమ్మినేని భానుమతి, డాక్టర్ దాసరి ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయురాలు ఏవీకే సుజాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేజెండ్ల ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ మురుగుడు శ్రీహరి, గోళా రామస్వామి, డి.రాజా గోవింద్ పంచుమర్తి లక్ష్మీ భీమేష్, గుర్రం చిన వీరయ్య, కన్న స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

వీసీకే పార్టీ ఆధ్వర్యంలో

అట్టడుగు కులాలకు విద్యనందించిన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే అని ప్రొగ్రెసివ్ ఫోరం నాయకురాలు సంగిరెడ్డి వాణి పేర్కొన్నారు. జయంతిని పుర స్కరించుకుని అరండల్‌పేటలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీ స్ అసోసియేషన్ హాల్‌లో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అంటరానితనం రాజ్యామేలుతున్న సమయంలో మొట్టమొదటిగా అంటరాని కులాలకు విద్యనందజేసిన ఘనత సావిత్రీబాయి పూలేకు దక్కుతుందన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

ప్రొఫెసర్ టీడీ విమల

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ఏఎన్‌యూ మనస్తత్వ శాస్త్ర విభాగ ప్రొఫెసర్ టీడీ విమల పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో దేశ ప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే పురస్కారాన్ని టీడీ విమలకు ప్రదానం చేశారు. పురస్కారాన్ని స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నట్లు చెప్పారు. అక్కడక్కడ వివక్ష కొనసాగుతోందని చెప్పారు. వారు కూడా ఆనందంగా జీవితాలను గడపడానికి ఆత్మస్థైర్యం ఒక్కటే మార్గమని సూచించారు. సావిత్రీ బాయి పూలే మహిళల ఆత్మగౌరవ చిహ్నం వంటి వారని అన్నారు. మహిళలు చదువు, వృత్తిలో ఎదిగే సమయంలో తమ తప్పును ఎదుటి వారిపై రుద్దే తత్వాన్ని మానుకుని, ఆ తప్పు మరలా జరగకుండా ఏం చేయాలనే విషయంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్, డాక్టర్ వేల్పుల బ్యూలా రాణి, చిలకా అరుణ, ప్రొఫెసర్ ఎస్వీఎస్ గిరిజ, డాక్టర్ కె.శ్రీలక్ష్మమ్మ, డాక్టర్ అబ్బరాజు మంజుశ్రీ, డాక్టర్ మన్నవ మాధవి, ఐ.శాంతిలత, కిరణ్, షేక్ హసీనా, ఆలూరి నట రాజకుమారి పాల్గొన్నారు.



విమలను సత్కరిస్తున్న హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు

రాష్ట్ర రజక జనసేవ సంఘం ఆధ్వర్యంలో

పేద వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి సావిత్రీబాయి పూలే అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం అధ్యక్షులు జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని యానాదికాలనీలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, సాంబయ్య, రాజు, రమాదేవి పాల్గొన్నారు.

భారతీయ మహిళందరికి ఆదర్శం

బాలికల విద్యకు భారత దేశంలో మొట్టమొదటి బీజం వేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని పల్నాడు జిల్లా పులిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పునీత కుమారి పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళ టీచర్లకు సన్మానం జరిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు జ్యోతి, గణేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

నెహ్రూనగర్: బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావుయాదవ్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న బీసీలకు రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య రథ యాత్ర ఒడిశా బోర్డర్ ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమై బుధవారం గుంటూరులో ప్రవేశించిన నేపథ్యంలో హిందూ కాలేజీ కూడలి వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రథయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. బీసీలకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నూకలమ్మ, వై.నాగేశ్వరరావు, రావుల నరసింహారావు, తోట శివరాం పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రథమ ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ రాష్ట్ర, జిల్లాస్థాయిలో పురస్కారాలు అందుకున్న ఐదుగురు ఉపాధ్యాయినులను సత్కరించారు. గుంటూరులోని శ్రీశారదానికేతన్ హెచ్ఎం ఉషారాణితో పాటు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయినులు వై.రమ, కె.సునీత, జి.పాప, విజయభారతి (పీఈటీ)ని సత్కరించారు. కార్యక్రమంలో ప్రతాప్‌సింగ్ శాస్త్రి, ఆపస్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్ పాల్గొన్నారు.



వివిధ రంగాల మహిళలకు సత్కారం



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



స్కూల్‌లో టీచర్లకు సన్మానం



హిందూ కళాశాలలో పూలే చిత్రపటం వద్ద..

తూర్పులో హ్యాట్రిక్ సాధించాలి



నూరిఫాతిమాను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన షేక్ నూరిఫాతిమా బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూరిఫాతిమాను ఎమ్మెల్సీ మర్రిరాజశేఖర్ దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పులో హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల పోరులో పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి సీఎం వైఎస్ జగన్‌కు బహుమతిగా ఇస్తామని చెప్పారు.



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రజక కాలనీకి చెందిన కోటేశ్వరరావుకు మూడు వేల రూపాయలు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు శ్రీను - సాక్షి ఫొటోగ్రాఫర్

దివ్యాంగులకు 'బజరంగ్' భరోసా

- దివ్యాంగ దర్శిని పేరిట పలు సేవా కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మంచాలలో పలువురికి జైపూరు కాలు అమరిక, ట్రైసైకిళ్ల పంపిణీ



మంచాలలో పండ్రంగి సురేష్‌కు జైపూర్ కాలును అమర్చి, భరోసా ఇస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు భరోసా ఇవ్వటం కోసం దివ్యాంగ దర్శిని పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల, సుద్దపల్లి గ్రామాల్లోని దివ్యాంగులకు జైపూర్ కాలు, ట్రై సైకిల్‌ను బుధవారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. మండల పరిధిలోని మంచాల గ్రామానికి చెందిన పండ్రంగి సురేష్‌కు అనారోగ్య కారణాలతో కాలు కొంత భాగం తొలగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన పండ్రంగి సురేష్ ను అంబటి మురళీకృష్ణ గత నెలలో పరామర్శించి జైపూర్ పాదాలు అందించి అతని కాళ్లమీద నిలబడే విధంగా తోడ్పాటును అందించనున్నట్లు భరోసా నిచ్చారు.. వైద్యుల ద్వారా జైపూర్ కాలును అమర్చటంతో దివ్యాంగుని కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తుమ్మల వెంకట శివయ్యకు ట్రై సైకిల్‌ను అంబటి మురళీకృష్ణ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకొని బజరంగ్ ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. జగన్మామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, దివ్యాంగ దర్శిని వంటి కార్యక్రమాలను బజరంగ్ ఫౌండేషన్ నిర్విరామంగా కొనసాగిస్తుందన్నారు. ఆయాచోట్ల జరిగిన సేవా కార్యక్రమంలో బజరంగ్ వలంటీర్లు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులకు ప్రాధాన్యం

పట్నంబజారు: నియోజకవర్గ అభివృద్ధి పనులలో సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు బుధవారం పొన్నూరు రోడ్డులో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాల వల్ల పొన్నూరు రోడ్డు గుంతలమయంగా మారి వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.1.90 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ఎమ్మెల్యే ముస్తఫా చేయిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆబిద్‌బాషా, సంకూరి శ్రీను, రావన బోయిన అజయ్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు బుజ్జి, రవిరాజ్, కరీముల్లా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరం అభివృద్ధి పథంలో శరవేగంగా ముందుకు సాగుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు నీచరాజకీయాలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మండి పడ్డారు. బుధవారం నియోజకవర్గంలోని మూడో డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ 9వలైనుకు రూ.45 లక్షలతో నూతన సైడ్ డ్రైయిన్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, ఇర్రి సాయి, స్వర్ణ, మాధవరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

తూర్పు నియోజకవర్గంలోని పదో డివిజన్ పాత గుంటూరు అంకమ్మతల్లి దేవస్థానం పక్కన ఉన్న యూపీహెచ్‌సీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీరావలి, ఆబిద్‌బాషా, అజయ్ పాల్గొన్నారు.



పొన్నూరు రోడ్డులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న నూరిఫాతిమా

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: నగరంలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె వలన పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, ప్రజారోగ్య రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం ఉదయం నగరంలోని వివిధ డివిజన్లలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఈఈలు, డెప్యూటీ కమిషనర్ల స్థాయిలో నగరంలో శానిటేషన్ పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులకు విధులు కేటాయించామని పేర్కొన్నారు. సమ్మెలో లేని కార్మికులను అన్ని డివిజన్లకు కేటాయించాలని, వెహికల్ షెడ్‌లోని డ్రైవర్లు ప్రధానంగా చెత్త పోగుపడే ప్రాంతాల్లో డంపర్ బిన్ల వద్ద వ్యర్థాలను తరలించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్మిక సంఘ నాయకులు కార్మికులను బలవంతంగా సమ్మెలోకి తీసుకెళ్లవద్దని, విధుల్లో ఉండే కార్మికులను అడ్డుకోవద్దని కోరారు. నగర ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున ప్రజలు తమ ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేయవద్దని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇంటి వద్దకు చెత్త సేకరణ చేయడానికి నగరపాలక సంస్థ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే ప్రజారోగ్యానికి ప్రమాదం కలుగుతుందని నగర ప్రజలు సహకరించాలని కోరారు. పర్యటనలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్‌ఈ సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఓ మధుసూదన్ పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నడింపల్లి నరసింహారావు చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: స్వాతంత్ర్య సమరయోధులు, గుంటూరు పురపాలక సంఘ ప్రప్రథమ చైర్మన్ నడింపల్లి నరసింహారావు నీతి నిజాయితీలకు నిబద్ధకు మరో పేరుగా నిలిచారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నడింపల్లి జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ధైర్యసాహసాలలో త్యాగంలో ప్రజల ప్రేమాభిమానాలను పొందటంలో నడింపల్లి నరసింహారావు అక్షరాల ప్రకారం పంతులుగా తరువాత అంతటి వారన్నారు. అందుకే ప్రకాం ఆంధ్రకేసి అయితే నడింపల్లి గుంటూరు కేసరి అయ్యారని చెప్పారు. అనంతరం సంస్థ సభ్యులు విశ్రాంత ఇంజనీర్ ఘన శ్యామాచార్యులు, సుజాత, కన్నా మాస్టరు, కమలాకాంత్ పాల్గొని నివాళులర్పించారు. నూతన సంవత్సం సందర్భంగా అవగాహన సంస్థ రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగాయి. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సినీ డైరెక్టర్ కె.జయకుమార్, రచయిత్రి ఎ.వి.కె. సుజాత పాల్గొన్నారు.



నడింపల్లి నరసింహారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

పరీక్షా పే చర్చలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో పరీక్షా పే చర్చా కార్యక్రమ నమోదుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఏపీసీ విజయలక్ష్మి చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో ఆన్‌లైన్‌లో పరీక్షా పే చర్చకు స్వయంగా నమోదు చేయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరీక్షా పే చర్చా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని విద్యార్థులు పొందుతారని చెప్పారు. అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులను నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



పరీక్షా పే చర్చకు విద్యార్థినులతో నమోదు చేయిస్తున్న ఏపీసీ విజయలక్ష్మి

హోమ్ గార్డుల ఐకమత్యం అభినందనీయం

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పదవీ విరమణ పొందిన హోంగార్డు జేవీఎస్ నాగేశ్వరరావుకు తోటి హోమ్‌గార్డులు అండగా నిలిచారు. హోమ్ గార్డులు అందరూ కలిసి ఒక రోజు వేతనం రూ.5,19,720 ఆర్థికసాయం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం చెక్కును జిల్లా ఎస్.పి వై.రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా నాగేశ్వరరావు స్వీకరించారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన హోమ్‌గార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో ఆర్.ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.



పోలీసు కార్యాలయంలో హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

న్యాయ శాస్త్ర కోర్సుల నూతన భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పేరుతో నిర్వహిస్తున్న న్యాయ శాస్త్ర కోర్సుల నూతన భవన నిర్మాణానికి బుధవారం వీసీ పి.రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ భవనానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నారు. సుమారు రూ.10.94 కోట్ల అంచనాతో ఈ భవనాన్ని సీపీడబ్ల్యూడీ నిర్మించనుంది. శంకుస్థాపన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, పాలకమండలి సభ్యులు సిహెచ్.స్వరూపరాణి, ఆచార్య కె.సుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్, డాక్టర్ షాహేద అక్తర్, వి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ కె.గంగాధర్ రావు, ఎ.ప్రమీలరాణి, ఓఎస్‌డీ కె.సునీత, సీడీసీ డీన్ కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, చీఫ్ ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.